క్లుప్తంగా

నేటి నుంచి కందుల కొనుగోళ్లు ప్రారంభం

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నేటి నుంచి కందుల కొనుగోళ్లను ప్రారంభించనున్నట్లు పీఏసీఎస్ సీఈవో ధరంసింగ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీరోజు జిల్లా కేంద్రంలో ప్రైవేటు మార్కెట్‌లో ప్రకటించిన ధరతోనే కందులు కొనుగోలు చేయనున్నట్లు పేర్కొన్నారు. మండల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షీటీం సేవలపై అవగాహన

ఎదులాపురం: పట్టణంలోని తిర్పెల్లి ప్రభుత్వ జెడ్పీఎస్ఎస్ హిందీ పాఠశాలలో శనివారం షీటీం ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. షీటీం అధికారులు సుశీల, సత్యం, మోహన్‌లు పాఠశాల విద్యార్థినులకు సైబర్ నేరాలు, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌లపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయంలో 100కు డయల్ చేయాలన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు కుటుంబాలను ఆదుకోవాలి

బోథ్: ఇటీవల ఆత్మహత్యలకు పాల్పడి మృతి చెందిన బోథ్ మండలంలోని బాబేర, నేరేడుపల్లి గ్రామాలకు చెందిన కౌలు రైతులు ఆత్రం శ్రీనివాస్, ఆత్రం భీమ్‌రావ్, ఆత్రం కాశీరామ్‌లను ప్రభుత్వం ఆదుకోవాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న డిమాండ్ చేశారు. శనివారం వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. రూ.10 లక్షల పరిహారం ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆయన వెంట భీంరావ్, నవీన్, రాములు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

బోథ్: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బోథ్ మండలస్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్‌ను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఎంపీడీవో సుశీల్ రెడ్డి హాజరై ప్రశ్నపత్రాలను విడుదల చేశారు. సైన్స్ ప్రాముఖ్యత, శాస్త్రీయ, వైజ్ఞానిక అంశాలకు సంబంధించిన పోటీ పరీక్షలకు ఏవిధంగా సన్నద్ధం కావాలో వివరించారు. ఆయా పాఠశాలకు చెందిన విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలి

ఇంద్రవెల్లి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక మార్గంలో పయనించాలని సమాక జంగుబాయి భక్తుడు కోరెంగా యేశ్వంత్‌రావ్ మహరాజ్ అన్నారు. శనివారం మండలంలోని తుమ్మగూడ గ్రామంలో ఏర్పాటు చేసిన జైజంగో.. జైలింగో దీక్ష సభకు హాజరయ్యారు. పవిత్రమైన పుష్యమాసంలో జంగుబాయి దీక్ష స్వీకరిస్తే కోరిన కోరికలు తీరుతాయన్నారు. హేరేకుంర సురేశ్, తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి కొడప నగేశ్, పెందోర్ అర్జున్, పుర్క బాపురావ్, ఆడ హన్మంతు, పెందోర్ పుష్పరాణి, సోయం మాన్కు పటేల్, సోయం వినోద్ పాల్గొన్నారు.

పర్సువాడలో వైద్య శిబిరం

నార్నూర్: గాదిగూడ మండలంలోని పర్సువాడ గ్రామంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ.. ఏదైనా అనారోగ్య సమస్యలు వస్తే వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చి వైద్యం చేయించుకోవాలన్నారు. ఆశ కార్యకర్తలు గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రతికాన్పు ప్రభుత్వ ఆసుపత్రిలో అయ్యేలా చూడాలన్నారు. ఇందులో హెచ్ఈవో పవర్ రవీందర్, వైద్య సిబ్బంది ఉమామహేశ్వరి, గంగాదేవి, గీత, లక్ష్మి పాల్గొన్నారు.

సంఘం అభ్యున్నతికి పాటు పడాలి

ఎదులాపురం: ఐక్యంగా ఉంటూ సంఘం అభ్యున్నతికి పాటు పడాలని మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. తాలూకా మున్నూరు కాపు సంఘ ఆధ్వర్యంలో సంఘ ప్రాంగణంలో శనివారం క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐక్యంగా ఉంటూ సంఘాన్ని మరింత బలోపేతం చేయాలన్నారు. ఇతర సంఘాలకు ఆదర్శంగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాళ్ల విఠల్, కలాల శ్రీనివాస్, కోశాధికారి కై పెల్లి జైపాల్, గ్రామ కమిటీ బాధ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడిపై దాడి

ఉట్నూర్‌రూరల్: మండలంలోని లక్కారం జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం రాత్రి ఉపాధ్యాయుడిపై దాడి జరిగింది. ఎస్సై మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా పరిషత్ పాఠశాలను నూతన భవనంలోకి మార్చిన తరుణంలో పాత భవనంలోని సామగ్రిని తరలిస్తున్నారు. ఈక్రమంలో విద్యార్థులతో సామగ్రి, రికార్డులు ఎందుకు మోపిస్తున్నావని స్థానికులు , రాకేశ్ అనే యువకుడు ఉపాధ్యాయుడు శామ్యూల్‌ను ప్రశ్నించారు. మాటామాట పెరిగి తనపై రాకేశ్ దాడికి పాల్పడినట్లు సదరు ఉపాధ్యాయుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

లక్ష్యం చేరేనా..?



పన్ను వసూలు చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

- బల్దియా ఆస్తిపన్ను లక్ష్యం రూ. 11.54 కోట్లు
- వసూళ్ల కోసం 18 ప్రత్యేక బృందాలు
- ఇంటింటికీ తిరుగుతున్న మున్సిపల్ సిబ్బంది

కైలాస్‌నగర్: పట్టణంలోని ఆస్తి పన్ను వసూళ్లపై ఆదిలాబాద్ మున్సిపల్ యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. శత శాతం పన్నుల వసూలే లక్ష్యంగా 54 మంది ఉద్యోగులతో 18 ప్రత్యేక బృందాలను నియమించింది. ఈఆర్థిక సంవత్సరం ముగింపునకు మరో 63 రోజుల గడువు ఉండడంతో ప్రత్యేక బృందాలు తమకు కేటాయించిన కాలనీల్లో ఇంటింటికీ తిరుగుతూ పన్నులు వసూలు చేస్తున్నారు. గతేడాది పెండింగ్ బకాయిల వసూళ్ల కోసం వన్‌టైం సెటిల్‌మెంట్ స్కీం (ఓటీఎస్)ను ప్రకటించి 90 శాతం వడ్డీ రాయితీ కల్పించిన బకాయిలు పూర్తిస్థాయిలో వసూలు కాలేదు. దీంతో ఆ పాత బకాయిలతో పాటు ఈఏడాది పన్నులను సైతం వసూలు చేయాలనే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు.

పన్ను లక్ష్యం రూ.11,54 కోట్లు..

జిల్లాలో గ్రేడ్1 స్థాయి కలిగిన ఏకైక ఆదిలాబాద్ మున్సిపల్‌లో ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.11,54,95,000 పన్నుల లక్ష్యంగా ఉంది. ఈనెల మొదటి వారం నుంచి పన్నుల వసూళ్లపై బల్దియా ప్రత్యేకంగా దృష్టి సారించింది. అందులో ఇప్పటి వరకు రూ.6,03,98,000లను వసూలు చేశారు. ఇంకా రూ.5,50, 97,000 కోట్ల పన్నులను వసూలు చేయాల్సి ఉంది. వంద శాతం వసూలు చేయాలనే ఉన్నతాధికారుల ఆదేశాలతో మున్సిపల్ అధికారులు ముందుకు సాగుతున్నారు. ఆర్ఐలు, బిల్ కలెక్టర్లు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో ఒక్కో టీంలో ముగ్గురు చొప్పున మొత్తం 18 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 7.30గంటల వరకు తమకు కేటాయించిన కాలనీల్లో ఇంటింటికీ తిరుగతూ పన్నులను వసూలు చేస్తున్నారు. మార్చి నెలాఖరులో ప్రభుత్వం ప్రత్యేక రాయితీలు ప్రకటిస్తుండటంతో చాలా మంది ఆస్తి పన్నును ముందుగా చెల్లించేందుకు ముందుకు రావడం లేదు. అందరూ మార్చి నెలాఖరులోనే చెల్లించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

ప్రభుత్వశాఖలే పెద్ద బకాయిదారులు

ప్రభుత్వ శాఖలు బల్దియాకు భారీస్థాయిలో బకాయిపడ్డాయి. పట్టణ పరిధిలో మొత్తం ప్రభుత్వ అసెస్‌మెంట్లు 756 ఉండగా.. వాటి బకాయిలు రూ.17,93,84,000కు పేరుకుపోయాయి. ప్రతీ ఏటా పన్నులను చెల్లించాల్సి ఉండగా పలు ప్రభుత్వ శాఖలు ముందుకు రావడం లేదు. వాటిని వసూలు చేయాల్సిన బల్దియా యంత్రాంగం సైతం ప్రభుత్వ శాఖలనే ఉద్దేశంతో అంతగా పట్టించుకోవడం లేదు. ఫలితంగా బకాయిలు భారీగా పేరుకుపోయాయి. రూ.17.93 కోట్లకు ఇప్పటి వరకు కేవలం రూ.55 లక్షలను మాత్రమే వసూలు చేశారంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈఏడాది పూర్తి స్థాయిలో పన్నులు వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకుంటారా? లేక మళ్లీ పాత కథ పునరావృత్తమవుతుందా? అనేది వేచి చూడాలి.

ఆదిలాబాద్ పట్టణంలోని వార్డుల సంఖ్య	49
పట్టణంలోని ప్రైవేట్ అసెస్‌మెంట్ల సంఖ్య	45,885
ప్రభుత్వ అసెస్‌మెంట్ల సంఖ్య	756

పన్నుల చెల్లింపు బాధ్యతగా భావించాలి



ఆస్తి పన్నులు వందశాతం వసూలు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఇందుకోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. ఈబృందాలు ఉదయం నుంచి రాత్రి వరకు ఇంటింటికీ తిరుగుతున్నారు. సకాలంలో పన్నులు చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలి.

–జాదవ్ కృష్ణనాయక్, బల్దియా రెవెన్యూ అధికారి

నేటి నుంచి గంగ జాతర



రామానంద్, మాధవ్‌రావ్ మహరాజ్‌ల దేవాలయాలు

- భారీగా తరలిరానున్న భక్తులు
- అన్ని ఏర్పాట్లు చేసిన నిర్వాహకులు

జైనథ్: ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలంలోని డొల్లార గ్రామ సమీపంలో గంగానది తీరంలో వెలిసిన రామానంద్, మాధవ్‌రావ్ మహరాజ్‌ల జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. మహారాష్ట్రలోని పాటన్ బోరి నుంచి శోభాయాత్రగా విచ్చేసిన రథం నది తీరంలో ప్రతిష్ఠించిన తరువాత 5 రోజుల పాటు జాతర నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతర కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

జాతర నేపథ్యం..

1889 నుంచి కొనసాగుతున్న ఈజాతర ప్రస్తుతం 135 వసంతాలు పూర్తి చేసుకుంది. ఇక్కడి నదిలో పుణ్యస్నానాలు చేస్తే సర్వపాపాలు, దోషాలు హరించుకునిపోయి పుణీతులవుతారని భక్తుల నమ్మకం. నదిలో స్నానం చేసి అమ్మవారికి తీర్థ ప్రసాదాలు సమర్పిస్తే మనసులో ఉన్న కోరికలు తీరుతాయని భక్తులు చెబుతుంటారు. యవత్‌మాల్ జిల్లా పాటన్– బోరిలోని స్వామి రామానంద్, మాధవ్‌రావ్ మహరాజ్ సంస్థన్ ఆధ్వర్యంలో ప్రతీ ఏటా జనవరి మాసంలో నిర్వహించే జాతరకు ఆదిలాబాద్ జిల్లా నలుమూలల నుంచే కాక, మహారాష్ట్ర నుంచి వేలాది భక్తులు తరలివస్తారు. ఐదు కుటుంబ సమేతంగా నదిలో స్నానాలు ఆచరించి, పిండి వంటలు వండుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పిస్తారు. అనంతరం నది ఒడ్డున ఉన్న రామానంద్, మాధవ్‌రావ్ మహరాజ్ విగ్రహాలను కు దర్శించుకుంటారు.

వైభవంగా రథయాత్ర..

రథోత్సవానికి ముందు రోజు మహారాష్ట్రలోని రామానంద్, మాధవ్‌రావ్ సంస్థన్‌లోని రామానంద స్వామి పాదుకలను సంస్థాన్ ఆధ్వర్యంలో స్థానిక గ్రామస్తులు, భక్తులు పాదయాత్రగా గంగానదికి తీసుకువస్తారు. ఆదివారం మహారాష్ట్ర నుంచి శోభాయాత్ర నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం స్వామి వారి పాదులకు నది ఒడ్డున ఆలయంలో ప్రతిష్ఠించడంతో జాతర ప్రారంభం అవుతుంది. ఈ పాదుకలను రథంలో ప్రతిష్ఠించి, నది తీరన శోభాయాత్ర నిర్వహించేందుకు ఏర్పాటు చేస్తారు. రథోత్సవం అనంతరం ప్రసాద వితరణ చేస్తారు. ఐదు రోజుల పాటు గంగామాత పూజ, ఆర్తీ, గణపతి అభిషేకం, వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న సురేశ్ రాథోడ్ నాయక్

ఎదులాపురం: సంత్ శ్రీ సేవాలాల్ 285వ జయంతి నిర్వహణలో భాగంగా నూతన ఉత్సవ కమిటీని ఆదివారం ఎన్నుకోనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు సురేశ్ రాథోడ్ నాయక్ తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సంత్ శ్రీ సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ కాల పరిమితి ముగిసిపోనుందన్నారు. దీంతో జిల్లా కేంద్రంలోని పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో బంజారా కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం మధ్యాహ్నం 2.30 గంటలకు సమావేశం ఉంటుందన్నారు. ఇందులో ఉత్సవ కమిటీ ఎన్నిక, సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. బంజారా సోదరులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పవార్ దేవిదాస్, బాబులాల్, రాథోడ్ శేషరావు, రామారావు, జాదవ్ బలరాం నాయక్, జాదవ్ పవన్‌నాయక్, చౌహాన్ నరేశ్ పాల్గొన్నారు.

జెడ్పీ సమావేశంపై విద్యార్థులకు అవగాహన



సమావేశంలో పాల్గొన్న విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో శనివారం జెడ్పీ సమావేశం ఏవిధంగా నిర్వహిస్తారో అవగాహన కల్పించారు. ఓ విద్యార్థి జిల్లా కలెక్టర్‌గా, మరో విద్యార్థిని జెడ్పీ చైర్‌పర్సన్‌గా వ్యవహరించారు. మరి కొంత విద్యార్థులు అధికార, ప్రతిపక్షం, అధికారులు, పాత్రికేయులుగా వ్యవహరించారు. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. రవాణా సౌకర్యాలు, తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్ల సౌకర్యం, రోడ్డు సౌకర్యం, ప్లాస్టిక్ నిషేధం, వైద్యం, ఆరోగ్యం, తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, జిల్లా ఎన్‌జీసీ కోఆర్డినేటర్ కంటే నర్సయ్య, సైన్స్ టీచర్లు రియాజ్, సుజాత, తెలుగు టీచర్లు శ్యామ్ రావు, పాచ్చన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పని చేస్తేనే సముచిత స్థానం



మాట్లాడుతున్న నగేశ్

ఎదులాపురం: నిబద్ధతతో పని చేసే కార్యకర్తలు, నాయకులకు సముచిత స్థానం కల్పించబడుతుందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నగేశ్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వెడ్మ బొజ్జు ఎమ్మెల్యేగా గెలుపొందడమే ఇందుకు నిదర్శనమన్నారు. వేలాది మంది కార్యకర్తల సమక్షంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చేతుల మీదుగా సన్మానం అందుకోవడం జిల్లాకు దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. సికింద్రాబాద్ ఎల్‌బీ స్టేడియంలో జరిగిన బూత్ కన్వీనర్‌ల సమావేశం విజయవంతంగా ముగియడం పట్ల ఆయన హర్షంవ్యక్తం చేశారు. నాయకులు సమీర్, కలీం, సంతోష్, వెంకన్న, అబ్దుల్లా పాల్గొన్నారు.

నేరడిగొండకు చేరుకున్న సైకిల్‌యాత్ర



యువకులను సన్మానిస్తున్న నాయకులు

నేరడిగొండ: లోక కల్యాణార్థం జహీరాబాద్, భైంసా నుంచి ఇద్దరు యువకులు అయోధ్య వరకు చేపడుతున్న సైకిల్ యాత్ర శనివారం నేరడిగొండకు చేరుకుంది. దీంతో హిందూ సంఘాల నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. అనంతరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రామ వార్డు సభ్యులు సాబ్లే సంతోష్ సింగ్ వారికి భోజన ఏర్పాటు చేశారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్, హిందూ వాహిని నాయకులు వారిని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో సాబ్లే సంతోష్ సింగ్, సోలంకి సాయి కిరణ్, సంతోష్ గౌడ్, సాయి ప్రసాద్, జాట్వే శ్రీను, మాన్కాని విక్కీ, నితిన్, కరణ్, అరుణ్ పాల్గొన్నారు.

‘అంతరాలు లేని విద్య ప్రజల హక్కు’



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఎదులాపురం: అంతరాలు లేని విద్య పొందడం ప్రజల హక్కు అని, అలాంటి విద్యను అందించడం ప్రభుత్వ కనీస బాధ్యత అని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) జిల్లా ప్రధాన కార్యదర్శి ఆత్రం సుగుణక్క అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రింట్ మీడియా ప్రెస్‌క్లబ్‌లో శనివారం మాట్లాడారు. ఫ్రిబవరి 11, 12 తేదీల్లో ఖమ్మంలోని నయాబజార్ స్కూల్ మైదానంలో రాష్ట్ర ద్వితీయ విద్యా వైజ్ఞానిక మహాసభలు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క హాజరవుతున్నారని పేర్కొన్నారు. అనంతరం మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు కనక వెంకటేశ్వర్‌రావు, జ్ఞానేశ్వర్, విద్యార్థి సంఘం నాయకులు భాస్కర్, వరుణ్, అతీశ్, నూతన్, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను గౌరవించాలి



మాట్లాడుతున్న జడ్జి హుస్సేన్

బజార్‌హత్నూర్: ప్రతిఒక్కరూ చట్టాలను గౌరవించాలని బోథ్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి హుస్సేన్ అన్నారు. శనివారం మండలంలోని భూతాయి(బి) గ్రామంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. యువత చెడు వ్యసనాలకు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, కష్టపడి చదివి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. మహిళలు సామాజిక సమానత్వం సాధించడానికి హక్కులు రాజ్యాంగంలో కల్పించబడ్డాయని వాటిని సద్వినియోగం చేసుకొని ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఫడ్ జ్ఞానేశ్వర్, ఎక్సైజ్ సీఐ చంద్రమౌళి రాజేశ్వర్, పంద్రం శంకర్, ఎట్టం రాములు, ధరంపాల్, ధరాసింగ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

సదస్సుకు తరలిరండి

ఎదులాపురం: ఎమ్మార్పీఎస్ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న ఆధ్వర్యంలో హైదరాబాద్ బాగ్‌లింగంపల్లి విజ్ఞాన కేంద్రంలో ఈనెల 29న నిర్వహించే రాష్ట్రస్థాయి సదస్సుకు తరలిరావాలని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కదరపు ప్రవీణ్ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్, వర్గీకరణ, మాదిగల భవిష్యత్ కార్యాచరణపై చర్చ ఉంటుందన్నారు. సదస్సుకు ప్రొఫెసర్ కోదండరాం, మేధావులు, విద్యావంతులు హాజరవుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి కాంతరావు, జిల్లా అధ్యక్షుడు రమేశ్, గంగన్న, పెంటన్న, భగత్ గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

‘గెలుపే లక్ష్యంగా పని చేయాలి’



మాట్లాడుతున్న సర్పన్ లింగారెడ్డి

ఎదులాపురం: రానున్న ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు, కార్యకర్తలు పని చేయాలని జైనథ్ మండల బీఆర్ఎస్ నాయకులు సర్పన్ లింగారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తమ స్వార్థం కోసం పార్టీలు మారే నాయకుల కంటే ప్రజాసేవ చేసే నాయకులకే ఆదరణ ఎక్కువగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో విఫలమవుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రస్తావించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణ, మహాసభ నిర్వహణపై చర్చించారు. మాజీ మంత్రి జోగు రామన్న కార్యకర్తలకు అన్నివిధాలా అండగా నిలబడతారన్నారు. ఫిబ్రవరి 6న నిర్వహిస్తున్న మహాసభలో అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్ రెడ్డి, యాసం నర్సింగ్ రావు, ఊషన్న, తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న గజానంద్ నాయక్

నార్నూర్: మండల కేంద్రంలో ప్రతిష్టాత్మకంగా 15 రోజులపాటు కొనసాగే ఖందేవ్ జాతర క్రికెట్ పోటీలను శనివారం సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ గజానంద్ నాయక్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దారుఢ్యం పెంచుతాయన్నారు. గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలని, ఓటమి ఎన్నో విజయాలకు పునాదిగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఆడే సురేశ్, ఉప సర్పంచ్ మహేందర్ చౌహాన్, కాంగ్రెస్ అధ్యక్షులు లోఖండే దేవురావు, లోఖండే చంద్రశేఖర్, కోర్రెల్లా మహేందర్, భిక్షపతి రాథోడ్, భార్కుంబే రాజు, సికిందర్ రాథోడ్, ఆడే మహేందర్ పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక ఆదివాసీలు

సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక ఆదివాసీ గిరిజనులని ఎంపీడీవో రమేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఖందేవ్ ఆలయంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. సీనియర్ అసిస్టెంట్ శశిధర్, జూనియర్ అసిస్టెంట్ రాజేందర్ కోటి, కైలాస్ నాయక్ జాదవ్, సచిన్ జాదవ్, భీమన్న, ప్రేమ్ పాల్గొన్నారు.

యువకుల ప్రతిభ వెలికితీసేందుకు..

నేరడిగొండ: వెనుకబడిన గ్రామీణ ప్రాంతాల యువకుల ప్రతిభను వెలికితీసేందుకే నియోజకవర్గంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ నాయకుడు ఆడే గజేందర్, తెలంగాణ రాష్ట్ర లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జాదవ్ బలరాంలు అన్నారు. శనివారం మండల కేంద్రంలో సర్పంచ్ కప్– 2 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మానసికోల్లాసానికి క్రీడలు ఎంతోగానో దోహద పడుతాయన్నారు. కార్యక్రమంలో క్రీడాకారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సమాచారం

ఐఎఫ్‌టీయూ అధ్యక్ష పదవికి రాజీనామా

ఎదులాపురం: సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా అనుబంధ కార్మిక సంఘం ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా పని చేస్తున్న జి.సుభాష్ ఆ పదవికి రాజీనామా చేసినట్లు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యక్తిగత కారణాలతో సభ్యత్వానికి, పదవికి రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడా సామగ్రి అందజేత

బోథ్: సోనాల గ్రామంలోని యువతకు పూలే వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో క్రికెట్, వాలీబాల్‌ను సామగ్రిని శనివారం అందజేశారు. వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గాజుల పోతన్న మాట్లాడుతూ.. గ్రామీణ యువతను క్రీడల్లో ప్రోత్సాహించే ఉద్దేశంతో క్రీడా సామగ్రి అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గాజుల పోతన్న, సాయికృష్ణ, పాటిల్ అమతరావు, రమేశ్, కసిరే పోతన్న, దినేష్ కుమార్ పాల్గొన్నారు.

పరామర్శ

బోథ్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి సత్తు మల్లేశ్ తండ్రి సత్తు నర్సయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. కాగా ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ విచార్ విభాగ్ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ తుల అరుణ్ కుమార్ శనివారం కుటుంబసభ్యులను పరామర్శించారు.

శతాధిక వృద్ధురాలు మృతి

సిరికొండ: మండలంలోని సుంకిడి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు రాథోడ్ సోనాబాయి (104) శనివారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గత కొన్ని రోజులగా అనారోగ్యంతో బాధపడుతూ.. మృతి చెందినట్లు పేర్కొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం

కైలాస్‌నగర్: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉద్యోగిగా కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్న ఆర్టీసీ బస్‌స్టేషన్ రిజర్వేషన్ కౌంటర్ ఇన్‌చార్జి సయ్యద్ అహ్మద్ హుస్సేన్‌ను ఆర్టీసీ అధికారులు సన్మానించారు. డిపో మేనేజర్ కల్పన, ఉద్యోగులు, సిబ్బంది ఆయనను సన్మానించి అభినందనలు తెలిపారు.

ఎలక్ట్రిషన్ డే వేడుకలు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని ప్రైవేట్ ఎలక్ట్రిషన్స్, ప్లంబర్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఎలక్ట్రిషన్ డే వేడుకలను శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పాల్గొని కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అక్బర్, బింగి రాజన్న, బింగి ఈశ్వర్, కలీం, గవాస్కర్, అజంత్, నర్సింలు, జమీల్, పోశెట్టి, శివ, రమణ పాల్గొన్నారు.

ఎంఐఎం ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

ఎదులాపురం: జిల్లా కేంద్రంలోని డైట్ మైదానంలో ఎంఐఎం ఆధ్వర్యంలో సలార్ మిలాత్ ఇంటర్ స్టేట్ క్రికెట్ పోటీలను పార్టీ పట్టణ అధ్యక్షుడు నజీర్ అహ్మద్ శనివారం ప్రారంభించారు. పోటీల్లో మొత్తం 32 జట్లు పాల్గొనున్నాయని తెలిపారు. గెలుపొందిన జట్టుకు రూ. 2 లక్షలు, రన్నరప్‌గా నిలిచిన జట్టుకు రూ. లక్ష నగదు బహుమతిగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏఎన్ఎంలకు సత్కారం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని అంకోలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉత్తమ సేవలు అందిస్తున్న ఇద్దరు ఏఎన్ఎంలను ఘనంగా సత్కరించారు. శనివారం పీహెచ్‌సీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మండల వైద్యాధికారి సర్ఫారాజ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మెమొంటో అందజేశారు. సన్మానం పొందిన వారిలో పిప్పల్‌ధరి సబ్ సెంటర్ పరిధిలోని ఏఎన్ఎం ముయ్యాల మోతి, మావల సబ్ సెంటర్ పరిధిలోని నజియాలు ఉన్నారు.

విజయవంతం చేయండి

ఎదలాపురం: ఫిబ్రవరి 1న జిల్లా కేంద్రంలోని కుమురం భీం భవనంలో నిర్వహించనున్న తెలంగాణ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం ప్లంబర్ యూనియన్ సర్వసభ్య సమావేశాన్ని విజయవంతం చేయాలని యూనియన్ మాజీ అధ్యక్షుడు ఆర్క శేషారావు, ఐఎఫ్ టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్ నారాయణ కోరారు.